ఆలోచనలే ఆవిష్కరణల మార్గాలు

జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ సుదర్శనరావు



మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పరిసరాలను, సమాజాన్ని కొత్తకోణంలో చూసే సామర్థ్యాలే ఆవిష్కరణలకు మార్గాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో సింపోజియం సెమినార్‌లను మంగళవారం నిర్వహించారు. వీసీ, హైదరాబాద్ డీఆర్‌డీఓ జేడీ హరి వెంకటేశ్వరరావు ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, ఇంధన వినియోగాన్ని తగ్గించి.. పర్యావరణాన్ని కాపాడే దిశలో విద్యుత్ వాహనాలు రూపుదిద్దుకున్నాయని అన్నారు. గూగుల్, యాప్స్, బ్రౌజర్ తదితర సాఫ్ట్‌వేర్‌లు నిత్యం అప్‌డేట్ అవుతున్నాయని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు తమ తెలివితేటలను పరీక్షించుకునేందుకు ఇలాంటి నేషనల్ టెక్నికల్ సింపోజియం కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. పరిశోధనలు చేసినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని అన్నారు. నైపుణ్యాలను పెంపొందించేందుకు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని హరి వెంకటేశ్వరరావు అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి సూచనలు, సలహాలిచ్చారు. సింపోజియంలో ప్రాజెక్టులు ప్రదర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పలు కళాశాలల విద్యార్థులు తరలివచ్చారు. అంతలక్ష్మి విద్యార్థుల ప్రొటోటైపింగ్ త్రీడీ ప్రింటింగ్, ఫ్లోసేఫ్ ఇంటెలిజెంట్ పంప్, జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల రెట్రో గేమింగ్ తదితర ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి.

కట్టిందే పన్ను..!

- అధికారులకు ముడుపులు
- బాణసంచా వ్యాపారుల మాయ
- అనంతలో ఒకరు.. గుంతకల్లులో ఇద్దరు
- దీపావళి టర్నోవర్ రూ.8 కోట్ల పైమాటే..
- దుకాణదారుల నుంచి భారీగా వసూళ్లు



శ్రీనగర్ కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు

అనంతపురం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కీలక వ్యాపారి. టపాసుల వ్యాపారంలో ఆరితేరాడు. ప్రత్యేకంగా టపాసులకు మేగజైన్ (శాశ్వత లైసెన్స్) అనుమతి తెచ్చుకున్నాడు. హోల్‌సేల్‌తో పాటు రీటైల్ వ్యాపారమూ నడుపుతారు. రూ.కోట్లలో టర్నోవర్ చేస్తుంటాడు. పన్నుల శాఖకు ఆయన ఎంత కడితే అంతే పన్ను..! అడిగే దిక్కు లేదు. గుంతకల్లులోనూ ఇలాంటి వ్యాపారులు ఇద్దరున్నారు. వారు రీటైల్ బిజినెస్ చేయరు. వారు కూడా పన్నుల శాఖకు గండి కొడుతున్నారు. అధికారులకు ఆమ్యామ్యాలు అందుతుండటంతో వారికి అలా జరిగిపోతోంది. నగరంలో కొందరు వ్యాపారులదీ ఇదే దారి. కాకపోతే.. వారి స్థాయిలో కాదు..! శివకాశి నుంచి పెద్ద మొత్తంలో బాణసంచా తెచ్చి.. తాత్కాలిక వ్యాపారులకు విక్రయిస్తుంటారు.

రూ.8 కోట్ల టర్నోవర్

అనంతపురంలో ఉండే వ్యాపారికి జిల్లా కేంద్రానికి సమీప మండపంలో ఓ గోడౌన్ ఉంది. అక్కడి నుంచి హోల్‌సేల్ వ్యాపారం నడుపుతుంటాడు. నగర శివారులో రీటైల్ మార్కెట్ ఉంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, రాజకీయ పార్టీల వేడుకలకు నిత్యం బాణసంచా సరఫరా చేస్తుంటాడు. దీపావళి సీజన్‌లో అనంతపురం నగరంలో 120 వరకు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అధికారికంగా 300 వరకు, అనధికారికంగా రెండు వేల వరకు దుకాణాలు ఏర్పాటవుతాయి. ఒక్కో వ్యాపారి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు టపాసులు ఈ వ్యాపారి దగ్గర కొనుగోలు చేస్తారు. గుంతకల్లు వ్యాపారుల నుంచి సైతం కొందరు కొనుగోలు చేస్తారు. దీపావళి సమయంలోనే కీలకమైన ముగ్గురు వ్యాపారులు, మిగిలిన వ్యాపారులు కలిపి రూ.8 కోట్ల వరకు టర్నోవర్ చేస్తారని సమాచారం.



ఉన్నతాధికారికి ముడుపులు

ముగ్గురు కీలక వ్యాపారులు పన్నుల శాఖకు చాలా తక్కువ శాతం పన్ను చెల్లిస్తారని సమాచారం. నిబంధనల ప్రకారం 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. కానీ వారు చెల్లించేదే జీఎస్టీ, వారు పాటించేదే నిబంధన అన్నట్లుగా పరిస్థితి తయారైంది. కొన్ని సంవత్సరాలుగా వారు ఎంత సరుకు తెస్తున్నారు, పన్ను ఎంత చెల్లిస్తున్నారు, ఎంత నిల్వ ఉంది అని పరిశీలించిన అధికారులే లేరు. దీనికి కారణం ముడుపులే అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇప్పటివరకు వారి బాణ సంచా వాహనాలను టచ్ చేసిందే లేదు. దీపావళి వస్తే ఉన్నతాధికారికి ప్రత్యేకంగా ముడుపులు, టపాసులు వెళతాయి. ఈ ఏడాది ఓ ఉన్నతాధికారికి రూ.5 లక్షలు అందినట్లు సమాచారం. ఆ వ్యాపారి ఓ వ్యక్తి ద్వారా నేరుగా ఈ మొత్తాన్ని పంపినట్లు తెలిసింది. గుంతకల్లులో ఓ ఇన్‌చార్జ్ అధికారి ముందుగానే వెళ్లి పని చక్కబెట్టుకున్నట్లు సమాచారం. దీపావళి పండుగకు వారం ముందుగా తనిఖీలు చేస్తే.. బడా వ్యాపారుల వద్ద సరుకు దొరికేది. కానీ పన్నుల శాఖ ఉన్నతాధికారులు మంగళవారం తనిఖీ చేయాలని ఆదేశాలు ఇచ్చారట. దీంతో తనిఖీల పేరిట కొందరు అధికారులు సందులు, గొందులు పట్టుకుని తిరుగుతున్నారు.

నిబంధనలు తుస్..

బాణసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో నిబంధనలు తుస్ మన్నాయి. దుకాణాలు మరీ అగ్గిపెట్టెల్లా కనిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం దుకాణానికి దుకాణానికి మధ్య ఆరు అడుగులు ఖాళీ ఉండాలి. కానీ గ్యాప్ ఇవ్వకుండా పక్కపక్కనే ఏర్పాటు చేశారు. అగ్నిమాపక శాఖ అధికారులు పట్టించుకోలేదు. టపాసులు ఎలా కాల్చాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పే ఆ శాఖ అధికారులు.. దుకాణాల ఏర్పాటులో పాటించాల్సిన నిబంధనల గురించి మాత్రం మాట్లాడటం లేదు. జాయింట్ కలెక్టర్ అభ్యంతరం చెప్పడంతో చివరికి కొన్ని మార్పులు చేశారు.

షెడ్డుకు రూ.35 వేలు

బాణ సంచా దుకాణాల ఏర్పాటు కోసం వసూళ్లకు దిగారు. ఒక్కో వ్యాపారి నుంచి రూ.35 వేలు వసూలు చేశారు. 'సంప్రదాయం' ప్రకారం అధికార పార్టీ నాయకులు ముందుండి ఈ వ్యవహారం నడిపారు. గతంలో వైసీపీ నాయకులు, ఇప్పుడు.. వీరు..! పన్నుల శాఖకు ఒక్కో దుకాణదారు రూ.25వేలు చెల్లించారు. నీటి కోసం రూ.60 వేలు, షామియానా, ఫర్నీచర్ కోసం రూ.లక్షకు పైగా ఖర్చవుతోందని దుకాణదారులు అంటున్నారు. ఇలా అయితే తమకు ఏం మిగులుతుందనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నాయకుల జేబుల్లోకి రూ.15 లక్షల వరకు చేరినట్లు తెలుస్తోంది.



నూతన యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

వహ్.. క్యా బాత్ హై..!

- పది వేల సెల్‌ఫోన్‌ల రికవరీ
- రూ.3.45 కోట్ల ఫోన్లు అందజేసిన ఎస్పీ

అనంతపురం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ల రికవరీలో అనంత పోలీసులు రికార్డు సాధించారు. ఈ ప్రక్రియను ప్రారంభించాక ఏకంగా 10 వేలకు పైగా రికవరీ చేశారు. పరేడ్ మైదానంలో మంగళవారం రికవరీ మొబైల్ ఫోన్ల మేళా నిర్వహించారు. రూ.3.45 కోట్ల విలువైన 1309 మొబైల్ ఫోన్లను ఎస్పీ జగదీష్ అందజేశారు. వీటితో కలిపి ఇప్పటివరకు రూ.18.85 కోట్ల విలువైన 10,195 ఫోన్లను బాధితులకు అందజేశారు. 2022 జూన్ 26 నుంచి జిల్లా పోలీస్ శాఖ చాట్‌బాట్ సేవలు అందిస్తోంది. చోరీకి గురైన, మిస్సయిన ఫోన్లను రికవరీ చేస్తోంది. దుకాణదారులు, వినియోగదారులు అపరిచితులు అమ్మే ఫోన్లను కొనుగోలు చేయవద్దని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. పరిచయస్తులైనా సరే బిల్లులు, ఫోన్ వివరాలు ఉన్న బాక్సు ఉంటేనే కొనాలని సూచించారు.

యాప్ అఫెండర్ సర్వైలెన్స్ ఆవిష్కరణ

యాప్ అఫెండర్ సర్వైలెన్స్‌ను ఎస్పీ జగదీష్ ఆవిష్కరించారు. రౌడీషీటర్లు, కిరాయి హంతకులు, ప్రాపర్టీ అఫెండర్స్, హంతకులు తదితర నేరస్థుల కదలికలపై నిఘా ఉంచి, పర్యవేక్షించడానికి ఈ యాప్ పోలీసులకు దోహదపడుతుంది. రద్దీ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడాలన్నా, రాత్రిళ్లు అనుమానాస్పదంగా తిరుగుతున్నా యాప్‌లోని ఫేస్ రికగ్నిషన్ వల్ల దొరికిపోతారు. ఈ యాప్‌ను రూపొందించిన మణికంఠ గౌతమ్‌ను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు, మహబూబ్‌బాషా, సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, షేక్ జాకీర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అన్యాయం

- ఏడు మండలాల్లోనే కరువు ఉందట
- వర్షపాత గణాంకాల ఆధారంగా ప్రకటన
- జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న ఖరీఫ్ పంటలు
- అయినా.. 24 మండలాలకు దక్కని చోటు



శింగనమలలో ఏపుగా పెరిగినా దిగుబడిలేని వేరుశనగ పంట (ఫైల్)

అనంతపురం అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయినా.. సాంకేతిక కారణాలతో అన్యాయం జరుగుతోంది. అవసరమైన సమయంలో వర్షం కురవకపోయినా.. మొత్తంగా కురిసిన వర్షాన్ని పరిగణనలోకి తీసుకుని.. కరువు మండలాలను ఎంపిక చేశారు. దీంతో కరువు జాబితాలో కేవలం ఏడు మండలాలకు చోటు దక్కింది. నార్పల, అనంతపురం, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటిస్తూ ప్రభుత్వం మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలోని అన్ని మండలాలలో ప్రధాన పంట వేరుశనగ సహా అన్ని పంటలూ ఖరీఫ్‌లో దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. కానీ ఏడు మండలాలలో కరువు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించడంలో మిగిలిన మండలాల రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

భారీగా పంటనష్టం

● జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ. తీవ్ర వర్షాభావంతో పంట దెబ్బతింది. దీంతో చాలామంది రైతులు దున్నేశారు. ప్రత్యామ్నాయ పంట వేద్దామని చూసినా.. వర్షం కురవలేదు. కొన్నిచోట్ల అరకొరగా దిగుబడి వచ్చినా.. కోత సమయంలో వర్షం కురిసి దిగుబడులు తడిసిపోయాయి. వేరుశనగ కట్టె కుళ్లిపోయింది. వేరుశనగకు కీలకమైన పూత, ఊడ, పిందె దశలో చుక్క వాన లేదు. సెప్టెంబరు ఊడలు దిగే సమయానికి వర్షం వచ్చి ఉంటే మంచి దిగుబడులు వచ్చేవి. కానీ వానలు లేక నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో వేరుశనగ పైకి పచ్చగా ఉన్నా.. దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి. ఇతర పంటల పరిస్థితీ ఇదే.

● ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 7.90 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. ఇందులో 1.11 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగైంది. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.45 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. వానలు లేక దిగుబడి బాగా తగ్గింది. ఎకరానికి 15 నుంచి 20 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా.. 3 నుంచి 5 బస్తాలకు పరిమితమైంది. చెట్టుకు నాలుగైదు కాయలే కాశాయి. అవీ నీరుబుడ్డలు కావడంతో తీవ్రంగా నష్టపోయారు. కూలి ఖర్చులు కూడా రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఖరీఫ్ వర్షపాతం వివరాలు (మి.మీ.లో)		
నెల	సాధారణం	నమోదు
జూన్	61.0	147.7
జూలై	63.9	24.4
ఆగస్టు	83.8	210.8
సెప్టెంబరు	110.9	48.4
మొత్తం	**319.6**	**431.3**

వెంటాడిన వర్షాభావం

జూన్ మొదటి రెండు వారాలు, ఆగస్టు మూడో వారంలో మాత్రమే జిల్లాలో బాగా వర్షాలు కురిశాయి. జూన్ సాధారణ వర్షపాతం 61 మి.మీ. కాగా.. ఆ నెల తొలి పక్షం రోజుల్లో ఏకంగా 143 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన పక్షం రోజుల్లో కేవలం 4.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. జూలైలో వర్షాభావం వెంటాడింది. ఆగస్టులో పక్షం రోజులపాటు సరైన వర్షం పడలేదు. 14 నుంచి 22వ తేదీ మధ్య భారీ వర్షాలు పడ్డాయి. సెప్టెంబరు మొదటి వారంలో మోస్తరు వర్షాలు పడ్డాయి. జూన్ 15 నుంచి ఆగస్టు 15 దాకా రెండు నెలల్లో కొన్ని మండలాల్లో 50 రోజులపాటు చినుకు జాడేలేదు.

అందుకే అన్యాయం..

ఖరీఫ్ సీజన్ మొత్తం వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో సాంకేతికంగా కరువు కనిపించడం లేదు. మొత్తంగా ఖరీఫ్ సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగానే కురిసిందన్న సాకుతో కరువు మండలాలను భారీగా కుదించారు. జిల్లాలో 31 మండలాలు ఉండగా.. కేవలం ఏడింటికి జాబితాలో చోటు కల్పించారు. మిగలిన 24 మండలాల రైతులకు మొండిచేయి చూపారు. వర్షపాతం, గాలిలోతేమ శాతం, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భ జల స్థాయి, పంటల పచ్చదనం తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకుని కరువు మండలాలను ప్రకటించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ సాధారణ వర్షపాతం 319.6 మి.మీ. కాగా.. ఈ ఏడాది 431.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం కంటే 34.9 మి.మీ. ఎక్కువ. ఈ లెక్కల ఆధారంగా కరువు ఉన్నా.. లేనట్లు చూపించారు.

ఒకటినే పింఛన్ పంపిణీ

జిల్లాలో 2.85లక్షల మందికి రూ.124.97కోట్ల నిధులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నవంబరు 1న లబ్ధిదారుల ఇళ్ల వద్దే నిర్వహించను న్నారు. ఉదయం 6గంటలకు గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్‌దారులకు పింఛన్ సొమ్మును అందజేయనున్నారు. నవంబరు నెలకు సంబంధించి జిల్లాలో 2,85,004మంది పింఛన్‌దారులకు రూ.124.97కోట్లు నిధులు మంజూరు చేశారు. వృద్ధులు 1,40,770మందికి రూ.56.30కోట్లు, వితంతువులు 66,412మందికి రూ.26.56కోట్లు, చేనేతలు 6,634 మందికి రూ.2.65కోట్లు, కల్లుగీత కార్మికులు 354మందికి రూ.14.1లక్షలు, మత్స్యకారులు 877మందికి రూ.35.లక్షలు, ఒంటరి మహిళలు 6,704మందికి రూ.2.68కోట్లు, సఫాయి కర్మాచారులు 3,492మందికి రూ.1.39కోట్లు, హిజ్రాలు 206మందికి రూ.82వేలు పంపిణీ చేయనున్నారు. హెచ్ఐవీ బాధితులు 2,450మందికి రూ.98లక్షలు, డప్పు కళాకారులు 3,111మందికి రూ.1.24కోట్లు, కళాకారులు 180మందికి రూ.72వేలు, దివ్యాంగులు 46,018మందికి రూ.27.61కోట్లు, కుష్ఠు వ్యాధి బాధితులు 382మందికి రూ.22లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,428మందికి రూ.2.14కోట్లు, ప్రమాద బాధితులు 1077మందికి రూ.1.61కోట్లు అందజేస్తారు. అభయహస్తం కింద 4,215మందికి రూ.21లక్షలు ఇతరత్ర బాధితులకు కలిపి మొత్తం 2,85,004మందికి రూ.124.7కోట్లు నిధులు విడుదల చేశారు. ఈనెల 31న దీపావళి కావడంతో 30నే బ్యాంకుల నుంచి పింఛన్ పంపిణీ సొమ్మును సిబ్బంది డ్రా చేస్తారని, నవంబరు 1న లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేస్తారని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు.


దోశలు వేస్తున్న కిట్టిరెడ్డి

కిట్టీ దోశ..

టేస్ట్ అదుర్స్..!

ఫిదా అవుతున్న నార్పల ప్రజలు


కస్టమర్లకు దోశలు అందజేస్తూ...

ఒక్కోరి చేత్తో ఏ పదార్థం చేసినా టేస్ట్ అదిరిపోతుంది. మామూలు పదార్థాలతోనే చేసినా రుచి మాత్రం వేరే లెవల్లో ఉంటుంది. ఆ కోవకు చెందినదే నార్పలలోని కిట్టిరెడ్డి కిట్టీ దోశ. స్థానిక కార్పొరేషన్ ఎదురుగా ఉన్న ఈ చిన్న హోటల్ ముందు ఉదయమే దోశల కోసం క్యూ కడుతుంటారు. లోపల పదిమంది కూర్చొని తింటూ ఉంటే బయట 20 నుంచి 30 మంది దాకా తమ వంతు కోసం వేచి చూస్తుంటారు. ఇక్కడ సాధారణ పెనం మీద బియ్యం పిండితో వేసిన దోశకు ఎర్ర కారం తగిలించి ఇస్తారు. దాన్ని వేరుశనగ విత్తనాల చెట్నీతో తింటే అద్భుతం అనాల్సిందే. ఒక్కొక్క దోశ పది రూపాయలు మాత్రమే. ధర తక్కువగా ఉండటంతో పాటు రుచి అద్భుతంగా ఉండటంతో కూలి పనులు చేసుకునే వారి నుంచి పోలీసుల వరకు కిట్టిరెడ్డి దోశల కోసం వస్తుంటారు. ఉదయం ఆరు గంటల నుంచి 11 దాకా హోటల్ నిర్వహిస్తారు. ఇక్కడ దోశలతో పాటు ఇడ్లీలు కూడా లభిస్తాయి. రోజుకు కిట్టి రెడ్డి కి రూ.5వేల నుంచి రూ. 7వేల వరకు వ్యాపారం జరుగుతుంది. 20 ఏళ్ల నుంచి నార్పలలో హోటల్ నిర్వహిస్తున్నట్లు కిట్టి రెడ్డి(సంజీవ్‌రెడ్డి) తెలిపారు. నాణ్యమైన, రుచికరమైన దోశలను నార్పల ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు.

- నార్పల, ఆంధ్రజ్యోతి

సీఎల్ఐఎస్సీ కోర్సులో ప్రవేశాలు

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఐదు నెలల సీఎల్ఐఎస్సీ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ మంగళవారం తెలిపారు. విజయవాడలోని పీఎస్ స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ గుంటూరులోని వావిలాల లైబ్రరీ సైన్స్, కడపలోని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ శిక్షణా సంస్థల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఒక్కో సంస్థలో 40 చొప్పున మొత్తంగా 240 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నవంబరు 1 నుంచి 15వరకు శిక్షణా సంస్థల్లో దరఖాస్తులు విక్రయిస్తారని, వాటిని నవంబరు 18లోగా పోస్టు చేయాలని వివరించారు. డిసెంబరు నుంచి ఏప్రిల్ 30 వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు.

1 నుంచి రెండో దశ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఆర్‌సెట్) రెండో దశ అడ్మిషన్లు నవంబరు 1వ తేదీ నుంచి చేపట్టనున్నారు. 2,566 సీట్లకుగాను, తొలి దశలో 2005 సీట్లు భర్తీ చేశారు. మిగిలిన సీట్లను రెండో దశలో భర్తీ చేయనున్నారు. సమగ్ర సమాచారం కోసం.. సెట్స్‌ఏపీసీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ వెబ్‌సైట్ చూడాలని కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సూచించారు.

చీటింగ్ కేసులో వైసీపీ ఉపసర్పంచ్ అరెస్టు

కదిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తలుపుల మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్, వైసీపీ నాయకుడు చింతకుంట క్రిష్ణారెడ్డి అలియాస్ డిక్కీబాబును చీటింగ్ కేసులో మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తనకల్లు మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయురాలు నాడు-నేడు పనుల్లో అవకతవకల ఆరోపణలతో సస్పెండయ్యారు. డిక్కీబాబు.. సస్పెన్షన్ ఎత్తివేయిస్తానని నమ్మబలికి ఆ ఉపాధ్యాయురాలి వద్ద రూ.8 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. రూ.ఐదులక్షల నగదు, రూ. రెండు లక్షలకు ప్రాంసరీ నోట్లు రాయించుకున్నాడు. సస్పెన్షన్ ఎత్తివేయించకపోవడంతో ఆ ఉపాధ్యాయురాలు.. డిక్కీబాబును నిలదీసింది. తలుపులలోని తన కార్యాలయానికి వస్తే డబ్బులిస్తానని ఉపాధ్యాయురాలిని పిలిపించుకున్నాడు. అక్కడికెళ్లాక మిగతా రూ.లక్ష ఇవ్వాలనీ, లేకపోతే చంపుతానని కత్తితో బెదిరించాడు. దీనిపై ఉపాధ్యాయురాలు.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు తలుపుల పోలీసులు కేసు నమోదు చేశారు. డిక్కీబాబును తలుపులలోని ఆంజనేయస్వామి గుట్టవద్ద అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.రెండులక్షల నగదు, రెండు ప్రాంసరీ నోట్లు, కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పలు కేసుల్లో నిందితుడు..


క్రిష్ణారెడ్డి అలియాస్ డిక్కీబాబుపై ఆరు కేసులు నమోదయ్యాయి. రౌడీషీట్ కూడా ఉంది. ఉద్యోగులను బెదిరించడం, ఎస్సీ ఎస్టీలపై దౌర్జన్యం కేసులు నమోదయ్యాయి. రైస్‌పుల్లింగ్ పేరుతో అనేక మందిని మోసం చేసినట్లు కేసులున్నాయి.


ధ్వంసమైన పతిమల తూము కాలువ

- ధ్వంసమైన శ్రీరంగరాయలచెరువు కాలువలు
- పెరిగిపోయిన కంపచెట్లు, జనుము
- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- బీడుగా మారిన ఆయకట్టు భూములు


కాలువలో పెరిగిన జనుము

శ్రీరంగ రంగా..!


ధ్వంసమైన పెద్దకాలువ తూము

శింగనమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోకపోవంతో శింగనమల శ్రీరంగరాయలచెరువు కింద కాలువలు ధ్వంసమయ్యాయి. కాలువల పొడవునా కంపచెట్లు, జనుము పెరిగిపోయింది. జిల్లాలో అతిపెద్ద చెరువుగా ఉన్న శ్రీరంగరాయలచెరువు కింద 2,500 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఈ భూమికి నాలుగు కాలువల ద్వారా నీరు సరఫరా అవుతుంది. గత పదేళ్లుగా చెరువులో సమృద్ధిగా నీరు ఉన్నా ఒక తూము కింద ఆయకట్టు భూములకే సరఫరా అవుతోంది. ఆ ఆయకట్టు రైతులు మాత్రమే పంటలు సాగు చేస్తున్నారు. ఇక చిన్నకాలువ, పెద్దకాలువ పతిమల కాలువ కింద ఉన్న చివరి ఆయకట్టు వరకు నీరు పారడం లేదు. ఎక్కడ పడితే అక్కడ కాలువలు ధ్వంసం కావడం, కంప చెట్లు జనుము పెరిగిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. వీటిని తొలగించడానికి ప్రతి ఏటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పదేళ్ల నుంచి పతిమల తూము కింద పంట సాగు చేసిన దాఖలాలే లేవు. దానితో కాలువ పొడవునా ఆయకట్టు భూముల్లో కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. ఈ కాలువలకు 20 సంవత్సరాలు కిందట మరమ్మతులు చేసిన ట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ఎవరిని అడిగినా ప్రయోజనం లేకుండా పోయిందని, కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకుని కాలువకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఇందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పదేళ్ల నుంచి బీడుగానే ఉంచాం..



మాకు పతిమల తూము కింద చివరిలో భూమి ఉంది. పదేళ్ల కిందట పంట సాగు చేసేవాళ్లం. మా భూమి ఆయకట్టుకు చివరిగా ఉండటం, కాలువ పొడవునా కంపచెట్లు, జనుము పెరగడం, కాలువకు ఉన్న రాళ్ల ధ్వంసం కావడంతో నీరు రావడం లేదు. దీంతో పదేళ్లుగా బీడుగా ఉంచాం.

- లక్ష్మన్న, గోవిందరాయునిపేట, రైతు

ఇబ్బంది పడాల్సిందే



మాకు పెద్ద కాలువ కింద భూమి ఉంది. ఈకాలువ కింద పంటలు సాగు చేస్తే నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. కాలువ ఎక్కడ చూసినా ధ్వంసం కావడంతో నీరు మెట్ట భూముల్లోనే ఆగిపోతోంది. పదేళ్ల కిందట పంట సాగు చేశాం. అప్పుడు పై రైతులతో గొడవ పడి నీరు తీసుకొచ్చాం. ఇప్పుడు గొడవలు పడే ఓపిక లేదు. అందుకే అప్పటి నుంచి పంట సాగు చేయలేదు. గండ్లు లేకుండా కాలువకు మరమ్మతులు చేయాలి. అప్పడే పంట సాగు చేస్తాం.

- నాగేంద్ర, గోవిందరాయునిపేట రైతు

ఎమ్మెల్యే చొరవ చూపాలి..



చెరువు కింద నాలుగు తూముల కాలువలు వెంటనే మరమ్మతులు చేయాలి. అపుడే అన్ని కాలువల ద్వారా ఆయకట్టుకు నీరు చేరుతుంది. లేకపోతే కాలువ మొదటి భూములల్లోనే వృథాగా పోతుంది. ఎమ్మెల్యే బండారు శ్రావణి చొరవ చూపి మరమ్మతులకు నిధులు తీసుకు రావాలి.

- శ్రీరాములు, రైతు, పోతురాజుకాల్వ

ఎన్నిసార్లు తెలిపినా ప్రయోజనం లేదు



చెరువు కింద కాలువలను మరమ్మతు చేయకపోతే చివరి ఆయకట్టు భూములకు నీరు చేరడం కష్టమని గత పదేళ్ల నుంచి అధికారులకు ఎన్నిసార్లు తెలిపిన ప్రయోజనం లేదు. పాలకులు దృష్టి సారించి కాలువ మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి.

- డి.చిన్నప్పయాదవ్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపాం: సాయినాథ్, ఇరిగేషన్ జేఈ

శింగనమల చెరువు నాలుగు తూముల కింద ఉన్న కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

మహిళలదే ఆధిక్యం


ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్

పురుషుల కంటే అధికంగా 23,412మంది మహిళా ఓటర్లు

జిల్లాలో మొత్తం ఓటర్లు 20,20,441

అనంత అర్బన్‌లో అత్యధికం...

ఉరవకొండ అత్యల్పం

జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

అనంతపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితాను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. కలెక్టరు మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ 2025లో భాగంగా జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలలో కలిపి 20,20,441మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,98,764మంది ఉండగా, మహిళా ఓటర్లు 10,21,412మంది ఉన్నారన్నారు. అలాగే థర్డ్‌జెండర్స్‌ఓటర్లు 245మంది ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా అనంతపురం అర్బన్‌నియోజకవర్గంలో 2,81,757మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా ఉరవకొండ నియోజకవర్గంలో 2,24,635మంది ఓటర్లు ఉన్నారని కలెక్టరు తెలిపారు. ఈజిల్లా ఓటర్లలో పురుషులు కంటే 23,412మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని వెల్లడించారు. రాయదుర్గం నియోజకవర్గంలో 296, ఉరవకొండలో 260, గుంతకల్లులో 276, తాడిపత్రిలో 274, శింగనమలలో 293, అనంతపురం అర్బన్‌లో 285, కళ్యాణదుర్గంలో 261, రాప్తాడులో 281 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఈజాబితాను అన్ని నియోజకవర్గాలకు పంపుతామన్నారు. పరిశీలన అనంతరం వచ్చే ఏడాది జనవరి 6న ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామని కలెక్టరు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనకరాజు, ఈడీటీలు సుజాత, వరప్రసాద్, సువర్ణ, రామకృష్ణ, హబీబా, ఐటీ ప్రోగ్రామ్ ఇంజినీర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్‌జెండర్స్	మొత్తం ఓటర్లు
రాయదుర్గం	1,30,558	1,33,409	42	2,64,009
ఉరవకొండ	1,10,702	1,13,905	28	2,24,635
గుంతకల్	1,33,021	1,37,804	74	2,70,899
తాడిపత్రి	1,23,513	1,25,509	25	2,49,047
శింగనమల	1,23,266	1,24,682	29	2,47,977
అనంతపురంఅర్బన్	1,37,943	1,43,786	28	2,81,757
కళ్యాణదుర్గం	1,14,603	1,16,639	05	2,31,249
రాప్తాడు	1,25,178	1,25,678	12	2,50,868

కలెక్టర్ కంటే ముందే..

జిరాక్స్ సెంటర్ వద్ద ఓటర్ల ముసాయిదా జాబితా

అనంతపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రహస్యంగా ఉండాల్సిన ఓటర్ల జాబితా అధికారికంగా విడుదల కాకముందే జిల్లా కేంద్రంలోని జిరాక్స్ సెంటర్ల వద్ద మంగళవారం కనిపించింది. ఓటర్ల ముసాయిదా జాబితా-2025ను కలెక్టరు వినోద్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. ఈఓటర్ల జాబితాను భద్రతా నియమాలు పాటిస్తూ ముద్రించి, అంతే భద్రంగా కలెక్టరేట్‌కు చేర్చాలి. అక్కడ విడుదల చేసిన తర్వాత సంబంధిత శాఖల అధికారుల ద్వారా ప్రజాప్రతినిధులకు అందించాలి. ఇందుకోసం ప్రత్యేకంగా టెండర్ ఇస్తారు. ఆ టెండర్‌దారుడు నిబంధనల మేరకు జాబితా ముద్రణ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అలాకాకుండా టెండర్‌దారుడు జిరాక్స్ సెంటర్లకు ఇచ్చి అక్కడ ఈ ఓటర్ల జాబితాను ప్రింట్ చేయించాడు. అక్కడ కలెక్టరు జాబితాను విడుదల చేయకనే నడిరోడ్డులో ఉన్న జిరాక్స్‌సెంటర్లవద్ద ఈఓటర్ల జాబితా బండిల్స్ దర్శనమిచ్చాయి. జిరాక్స్ సెంటర్ల వద్ద రోడ్డున ఈబండిల్స్ పడేయడం చూసిన జనం ఫొటోలు తీసి కలెక్టరుకు పంపారు. మరి నిర్లక్ష్యం వహించిన అధికారులు, టెండర్‌దారుడిపై జిల్లా కలెక్టరు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే



సాయినగర్‌లోని జిరాక్స్ సెంటర్‌వద్ద ఓటర్ల జాబితా కాపీల బండిళ్లు

క్రీడా పోటీలు ప్రారంభం


ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో పోటీలను ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ప్రారంభించా రు. క్యారమ్స్, చెస్ ఆడిన ఐసీడీఎస్ ఉద్యోగులను ఆమె ప్రోత్సహించారు. అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కబడ్డీ, యోగా, చెస్, టేబుల్‌టెన్నిస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో క్రికెట్, ఫుట్‌బాల్, ఖో ఖో, అథ్లెటిక్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బెస్ ఫిజిక్, పవర్‌లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. మొత్తం 200మందికి పైగా ఉద్యోగులు పోటీల్లో పాల్గొన్నారు. బుధవారం ప్రసన్నాయపల్లి సమీపంలో స్విమ్మింగ్(ఈత) పోటీలు, ఆర్డీటీ స్టేడియంలో లాన్‌టెన్నిస్ పోటీలు ఉంటాయని డీఎస్‌డీఓ షఫీ తెలిపారు. జిల్లా స్థాయిలో విజేతలైన క్రీడాకారులు నవంబరు ఆరు నుంచి 9వతేదీ వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో శాప్ కోచ్‌లు నరేష్, రాఘవేంద్ర, వంశీ, అనిల్‌కుమార్, లక్ష్మి, జెబీవుల్లా, అలీ, మంజుళ, దేవమణి, సుచీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రచనలకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రాయలసీమ నాటక రచనా పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నట్లు ఆ వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 'రాయలసీమ సమాజం - జీవన సంస్కృతి' నేపథ్యంగా ఏకాంకిక, నాటిక, నాటక రచనలు పంపాల్సి ఉంటుందన్నారు. గెలుపొందిన రచయితలకు రూ.15వేలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన రచయితలు డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, డోర్ నెం. 1-1349, ప్లాట్ నెం.24, షైన్ విలాస్, టాటా షోరూమ్ వద్ద, నేషనల్ హైవే, రుద్రంపేట, అనంతపురం - 515 002 చిరునామాకు డిసెంబరు 22లోపు తమ రచనలను పంపాలన్నారు. వివరాలకు 99639 17187 నెంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు.

కేంద్ర పథకాలు పక్కాగా అమలు కావాలి



జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పక్కాగా అమలు చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని.. ప్రజల సమస్యలను ప్రస్తావించారు. వాటిని పరిష్కరించాలని కోరారు. వీటిపై ఎంపీ స్పందించారు. కేంద్రం ఇచ్చిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలని, లేదంటే వెనక్కి పోతాయని అన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం, విద్యా సంస్థలతో మధ్యాహ్న భోజనం, ఆస్పత్రులలో మెరుగైన వైద్యం తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. ఉద్యాన పంట దిగుబడుల తరలింపునకు జిల్లా నుంచి కిసాన్ రైలు నడపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో మహిళల విశ్రాంతి భవనం కోసం నిధులు ఇస్తానని, వెంటనే స్థలాన్ని చూసి పనులు ప్రారంభించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం జిల్లాకు వస్తోందని, అవసరమైన సమాచారాన్ని సేకరించి పెట్టుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్రిటికల్, ట్రామాకేర్ సెంటర్లకు నిధులు అవసరమని, కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయించాలని ప్రజా ప్రతినిధులను కలెక్టర్ కోరారు. జిల్లాలో జనరిక్ మందుల దుకాణాల గురించి సరైన సమాచారం ఇవ్వని ఆ శాఖ అధికారులపై ఎంపీ, కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజకీయ జోక్యంపై..

జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎంపీ అంబికా మధ్య ఆసక్తికర సంవాదం జరిగింది. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో రాజకీయ జోక్యం కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్సీ అన్నారు. దీంతో 'మీ ప్రభుత్వంలో రాజకీయ జోక్యం అధికంగా ఉండేది కదా..?' అని ఎంపీ ప్రశ్నించారు. 'మా ప్రభుత్వంలో రాజకీయ జోక్యం లేదని చెప్పడం లేదు. ఇప్పుడు అలా జరగకుండా చూడండి. ప్రజలకు న్యాయం జరిగేలా చూడండి' అని ఎమ్మెల్సీ అన్నారు. సమావేశంలో జడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీమ్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ పండగకైనా

ఇస్తారా..?



జీతం కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఎదురుచూపు

ఏడు నెలలుగా పీఆర్ క్యూసీ ఉద్యోగులకు పెండింగ్

కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు

అనంతపురం సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ) విభాగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వెలుగుల పండుగ(దీపావళి)పూట కూడా తమకు చీకట్లేనా అని వారు నిట్టూరుస్తున్నారు. వాస్తవంగా ప్రతి ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో ప్రతి ఏడాదికి సంబంధించి సుమారు రూ.67 లక్షలు వరకు ఏ ప్రభుత్వమైనా మంజూరు చేసేది. దీంతో ఏడాదిపాటు సకాలంలో జీతభత్యాలు ఇవ్వడంతో పాటు శాఖాపరంగా సంబంధిత పనులు కూడా వెంటనే జరిగిపోయేవి. అయితే గత సర్కార్ ఈ నిధుల మంజూరులో జాప్యం చేయడంతో ఉద్యోగులకు జీతాలు అందడం లేదు. దీంతో కుటుంబపోషణ కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి తగిన నిధులను వెంటనే మంజూరు చేసి న్యాయం చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు.

ఏడు నెలలుగా అందని జీతాలు


క్యూసీ విభాగంలో పనిచేస్తున్న 15మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు జీతాలు రాలేదు. ఒక్కొక్కరికి నెలకు రూ.19 వేలు చెప్పున ఏడు నెలలకు రూ. 1.33లక్షలు రావాల్సి ఉంది. మొత్తంగా 15మందికి మొత్తం రూ. 20 లక్షలు వరకు రావాల్సి ఉంది. జీతాల గురించి పలుమార్లు అడిగినా ఫలితం లేదు. వీరిలో ముగ్గురు ఉద్యోగులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ప్రభుత్వం మంజూరు చేసే నిధుల్లో జీతాలు పోగా మిగిలిన నిధులతో శాఖ పనులతో పాటు ల్యాబ్ పరీక్షలు, ఇతర సామగ్రి, వాహనాల అద్దెలకు సంబంధించి వినియోగించేవారు. కానీ గత సర్కార్ ముందస్తుగా నిధులను విడుదల చేయకపోవడంతోనే సమస్యలు ఏర్పడుతున్నాయి. నిధులేమైనా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందా అంటే అదీ లేదు. ఆయా జిల్లాల వారిగా ఎక్కడికక్కడ క్యూసీ హెడ్ అకౌంట్‌కు ఆయా పనుల ద్వారా కొంత శాతం నగదు జమ అవుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతో పాటు ఆశాఖ ఉన్నతాధికారుల మంజూరుకు అనుమతి ఇస్తే.. చాలు వెంటనే ఆయా జిల్లాల ఈఈలుగా సదరు అకౌంట్ నుంచి ఏ నెలకు ఎంత అమౌంట్ కావాలో.. డ్రా చేసుకుని జీతభత్యాలతో పాటు ఇతర పనులకు వినియోగించు కునే అవకాశం ఉండేదీ. ఒకసారి అనుమతిస్తే ఏడాది పాటు ఎలాంటి సమస్య ఉండేదీ కాదు. కానీ గత సర్కార్ ఎన్నికల హడావుడిలో పడి ఈ నిధులను మంజూరు చేయకుండా గాలికి వదిలేసింది. దీంతో అప్పటి నుంచి వీరికి ఇబ్బందులు తప్పడం లేదు.


క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం

ల్యాబ్ పరీక్షలు, సామగ్రి నిధులదీ అదే దుస్థితి

ల్యాబ్ పరీక్షలు, ఇతర సామగ్రి కొనుగోలు, అద్దె వాహనాల బిల్లులు తదితర వాటికి సంబంధించిన నిధులు కూడా ఏడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పనులు కూడా అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. ప్రధానంగా అద్దె వాహనాల బిల్లులు మంజూరు చేయకపోవడంతో అధికారుల పరిస్థితి కూడా ఇబ్బందికరంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిధుల మంజూరుకు అనుమతించి జీతాలు వచ్చేలా చూడాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు పీఆర్ శాఖ యంత్రాంగం కోరుకుంటోంది.

ప్రభుత్వానికి నివేదించాం



వేతన బకాయిలు, ఇతర నిధుల విషయంపై ప్రభుత్వానికి నివేదించాం. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే అనుమతి రావాల్సి ఉంది. తరచూ అడుగుతూనే ఉన్నాం. అనుమతి రాగానే నగదు డ్రా చేసి ఉద్యోగులకు జీతాలను అందజేస్తాం. క్యూసీ పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా చూస్తాం.

- మల్లికార్జున మూర్తి, క్యూసీ ఈఈ

బ్లాక్ స్టాంప్..!

ఉమ్మడి జిల్లాలో కృత్రిమ కొరత


గుంతకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



ఆర్థిక లావాదేవీలకు అవసరమయ్యే నాన్ జ్యుడీషియల్ (ఎన్‌జే) స్టాంప్ పేపర్లు దొరకడం గగనమైపోయింది. సుమారు రెండు నెలల నుంచి బాండ్ పేపర్లు దొరక్క రాయలసీమ జిల్లాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. వాటి కోసం ఆటో ఎక్కి విక్రయదారుల దుకాణాలను చుట్టేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ఎన్‌జే స్టాంపులను విక్రయదారులకు పంపిణీ చేసే విధానాన్ని వైసీపీ ప్రభుత్వం మార్చింది. మధ్యవర్తిగా ఓ ఏజెన్సీని రంగంలోకి దింపింది. ఆ ఏజెన్సీ ఎన్‌జే స్టాంపుల స్థానంలో ఈ-స్టాంప్ పేపర్లను విక్రయదారుల వద్ద ప్రజలకు అందుబాటులో పెట్టాలి. కానీ ఖాళీ స్టాంపు పేపర్లను ఇవ్వకుండా రెండు నెలలుగా కొరతను సృష్టించారు. ఈ కారణంగా సాధారణ లావాదేవీలకు నాన్ జ్యుడీషియల్ స్టాంపు, దానికి ప్రత్యామ్నాయంగా ఉన్న ఈ-స్టాంపు పేపర్లు దొరక్క లావాదేవీలు ఆగిపోతున్నాయి. ఇదే అదనుగా బ్లాక్‌లో మూడు రెట్ల ధరకు స్టాంపుల విక్రయాలు జరుగుతున్నాయి. సమస్య రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో పరిష్కారానికి చర్యలను ప్రారంభించింది.

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు/అనంతపురం క్రైం

నీరుగార్చిన వైసీపీ ప్రభుత్వం

ఆస్తి అమ్మకాలు, అమ్మకం అగ్రిమెంట్లు, తనఖా, అఫిడవిట్లు, డిక్లరేషన్లు తదితర అవసరాలకు నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లు అవసరం. వీటిని రిజిస్ట్రేషన్‌ల శాఖ నాసిక్ నుంచి ఆర్డరుపై తెప్పించి తొలుత జిల్లాలకు, ఆ తర్వాత జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపిణీ చేసేది. అక్కడి నుంచి స్టాంపు వెండర్లకు పంపిణీ చేసేవారు. కానీ రెండేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని నీరుగారుస్తూ మధ్యవర్తిగా ఏజెన్సీలను రంగంలోకి దింపింది. ఈ ఏజెన్సీల ద్వారా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల స్థానంలో ఈ-స్టాంపు పేపర్లను అమ్మడం ప్రారంభించింది. ఈ పద్ధతిలో స్టాంపు వెండర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లను తెచ్చి అమ్మకుండా, ఆన్‌లైన్ ద్వారా ఈ-స్టాంపు పేపర్లను అమ్మడం ప్రారంభించారు. కొన్నాళ్లు సవ్యంగా జరిగినా, రూ.10, రూ.20 ఈ-స్టాంపుల వల్ల లాభం తక్కువ అంటూ.. ఖాళీ స్టాంపులను జారీ చేయడం ఆపేశారు. ఈ కారణంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులు లేక, ఈ-స్టాంపు దొరక్క ఆర్థిక లావాదేవీలకు, అఫిడవిట్లకు విఘాతం ఏర్పడింది.

రిజిస్ట్రేషన్ కోసం ఒక స్టాంపు కాగితాన్ని వాడి, మిగతావి తెల్ల పేపర్లను వినియోగిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా రూ.5, రూ.10, రూ.20 స్పెషల్ అడిసివ్ స్టాంపు పేపర్ల కోసం రిజిస్ట్రారు కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. రూ.100 ఈ-స్టాంపునకు అదనంగా రూ.200 వసూలు చేసి రూ.300కు అమ్ముతున్నారు.

- అందుబాటులో లేని ఈ, ఎన్‌జే స్టాంపులు
- మూడు రెట్ల ధరకు బ్లాక్‌లో విక్రయాలు
- వైసీపీ ప్రభుత్వం తీరుతో ప్రజలకు కష్టాలు
- కమీషన్ కోసం ఈ-స్టాంప్ ఏజెన్సీ కుయుక్తులు
- ప్రభుత్వం దృష్టికి సమస్య.. పరిష్కారానికి చర్యలు



నాన్ జ్యుడీషియల్ స్టాంపు

కూటమి ప్రభుత్వం చర్యలు

వైసీపీ ప్రభుత్వం తీరుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దీంతో ఎన్‌జే స్టాంపులనుపాత విధానం ద్వారా వెండర్లకు ఇవ్వడానికి సానుకూలతను వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో చాలా రోజుల తరువాత నాన్ జ్యుడీషియల్ స్టాంపులు ఉమ్మడి జిల్లాకు చేరాయి. మొత్తం 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రూ.50, రూ.100 ముఖ విలువ కలిగిన నాన్ జ్యుడీషియల్ స్టాంపులను పంపిణీ చేశారు. రూ.100 స్టాంపులు 40 వేలు, రూ.50 స్టాంపులు 48 వేలు ఇప్పటి వరకూ అందాయి. రూ.10, రూ.20 ముఖ విలువ కలిగిన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు రావాల్సి ఉంది. అవి కూడా త్వరలో వస్తాయని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ వర్గాలు తెలిపాయి.

పంపిణీకి రంగం సిద్ధం

స్టాంపులు జిల్లాకు వచ్చినా, రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇంకా పంపిణీ కాలేదు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వాటిని పంపిణీ చేసేందుకు ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు. మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో ఫిజికల్‌గా వాటిని అందజేయనున్నారు. స్టాంప్ వెండర్లకూ వాటిని అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ-స్టాంపులు దొరకక ఇబ్బంది పడుతున్నవారికి నాన్ జ్యుడీషియల్ స్టాంపులు రావడంతో ఊరట లభించనుంది.

రెండు రోజుల్లో పంపిణీ..

నాన్ జ్యుడీషియల్ స్టాంపులు జిల్లాకు వచ్చాయి. ప్రస్తుతానికి రూ.50, రూ.100 స్టాంపులు అందాయి. రూ.10, రూ.20 స్టాంపులకు ఇండెంట్ పంపించాము. ఎన్‌జే స్టాంపులను ఇప్పటికే ఆన్‌లైన్‌లో పంపాం. ఫిజికల్‌గా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రెండు రోజుల్లో సరఫరా చేస్తాం. స్టాంప్ వెండర్లకూ అందజేస్తాం. ప్రతి కార్యాలయంలో ఎన్‌జే స్టాంపులు అందుబాటులో ఉండేలా చూస్తాం. ఈ-స్టాంప్‌లూ అందుబాటులో ఉంటాయి.

-భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్

కమీషన్‌లకు కక్కుర్తి

రాయలసీమ జిల్లాల్లో ఈ-స్టాంపు పేపర్లను జారీ చేయడానికి వైసీపీ ప్రభుత్వం కర్నూలుకు చెందిన స్టాక్ హోల్డింగ్ అనే సంస్థకు ఏజెన్సీని కేటాయించింది. ఈ సంస్థ ప్రజల నుంచి ఏర్పడే డిమాండుకు అనుగుణంగా స్టాంపు వెండర్లకు ఈ-స్టాంపు పేపర్లను సరఫరా చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ల కోసం కొనుగోలుదారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజును కూడా ఈ-స్టాంపు పేపరును అమ్మే స్టాక్ హోల్డింగ్ కంపెనీకే చెల్లించవచ్చు. అలా వసూలు చేసిన రిజిస్ట్రేషన్ ఫీజులు ప్రభుత్వానికే వెళ్లాయి. కానీ ఆ వసూళ్లపై సంబంధింత ఏజెన్సీకి కమీషన్ లభిస్తుంది. ఈ కిటుకును అడ్డుపెట్టుకుని ఖాళీ ఈ-స్టాంపు పేపర్ల జారీ చేయకుండా వెండర్లను ఏజెన్సీ నియంత్రించింది. ఈ-స్టాంపు కావాలంటే రిజిస్ట్రేషన్ ఫీజును తప్పకుండా తమకే చెల్లించాలనేలా వ్యవహరిస్తోంది. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే తప్ప ఈ-స్టాంపును అమ్మడం లేదు. ఈ కారణంగా ఈ-స్టాంపును కొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీఎఫ్ఎంఎస్, లేదా బ్యాంకు ద్వారా చలానా డబ్బు చెల్లించే అవకాశం లేకుండాపోయింది. ఆస్తి కొనుగోలు చేయాల్సినవారు గత్యంతరం లేక స్టాక్ హోల్డింగ్ కంపెనీ ద్వారానే ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ స్టాంపు డ్యూటీని చెల్లిస్తున్నారు. సేల్ అగ్రిమెంటు, అఫిడవిట్లు, తనఖా అగ్రిమెంట్లు తదితర చిన్న చిన్న లావాదేవీల కోసం ప్రభుత్వానికి చలానా కట్టాల్సిన అవసరం లేదు. ఇలాంటి అవసరాలకు ఈ-స్టాంపు పేపర్ దొరక్కుండా చేశారు. రిజిస్ట్రేషన్ ఫీజులపై వచ్చే కమీషన్‌పై కక్కుర్తితో ఇలా ఈ-స్టాంపు పేపర్ల కృత్రిమ కొరతను సృష్టించారు. ఏజెన్సీ నిర్వాకం కారణంగా ప్రభుత్వానికి నేరుగా రావాల్సిన స్టాంపు డ్యూటీలు రావడంలేదు. స్టాక్ హోల్డింగ్ ఏజెన్సీ ద్వారా జరుగుతున్న చెల్లింపులకు కమీషన్ చెల్లించాల్సి వస్తుండటంతో ఆస్తి క్రయవిక్రయాలను జరిపేవారిపై అదనపు భారం పడుతోంది.


ఎన్‌జే ఈ-స్టాంపు

పెద్దకొట్టాలపల్లి సొసైటీలో రూ.36.50 లక్షల రికవరీకి నోటీసులు

సొసైటీ మాజీ అధ్యక్షుడికి చెందిన 22 ఎకరాలు అటాచ్

విడపనకల్లు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)లో జరిగిన రూ. 50 లక్షల అవినీతిలో రూ. 36.50 లక్షలు రికవరీకి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆర్ఆర్ (రెవిన్యూ రికవరీ) యాక్ట్ ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు అధికారుల ద్వారా తెలిసింది. సొసైటీ మాజీ అధ్యక్షుడు గురుమూర్తిరెడ్డి 2019-20, 2020-21వ సంవత్సరంలో ఇష్టారాజ్యంగా నాటి సీఈఓ సుధానందరెడ్డి సహకారంతో సొసైటీ సొమ్ము స్వాహా చేశారని ఆరోపణలు వచ్చాయి. గురుమూర్తిరెడ్డి సొంతంగా రూ.6.32 లక్షలు, సుధానందరెడ్డి సహకారంతో రూ.30.24 లక్షలు స్వాహా చేసినట్లు తెలిసింది. ఈ మేరకు రూ. 36.56 లక్షలు రికవరీకి గురుమూర్తి రెడ్డికి చెందిన విడపనకల్లు మండలంలోని కడదరబెంచి గ్రామంలో గల 22 ఎకరాల భూమిని పెద్ద కొట్టాలపల్లి సొసైటీకి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భూమిని ఎవరికీ రిజిస్టర్ చేయకుండా గుంతకల్లు రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు.

విడపనకల్లు సొసైటీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విడపనకల్లు సొసైటీలో జరిగిన అవినీతికి సంబంధించి రూ. 44.81 లక్షలు రికవరీ చేయాలని మండలంలోని వేల్పుమడుగు గ్రామ రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎరువులను రైతులకు ఇవ్వకుండా కొంత మంది నిర్వాహకులు అక్రమంగా తరలించుకుని స్వాహా చేశారని పేర్కొన్నారు. ఆడిట్‌లో అవినీతి బయట పడిందని, స్వాహాచేసిన వారి నుంచి నగదును రికవరీ చేయాలన్నారు.

అపార్ నమోదు వేగవంతం చేయాలి

ఆర్జేడీ శామ్యూల్


ఎంఈఓ ఆఫీసులో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేడీ

కొత్తచెరువు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు అపార్ కార్డు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యాశాఖ కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (ఆర్జేడీ).. ఆ శాఖాధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. జిల్లాలో అపార్ నమోదుపై ఆరాతీశారు. జిల్లాలో 2.84 లక్షల మంది విద్యార్థులు ఉండగా.. ఇప్పటి వరకు 39,463 మందికి మాత్రమే ఆన్‌లైన్‌లో అపార్ నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థులకు త్వరగా పూర్తి చేయాలని ఆర్జేడీ ఆదేశించారు. అనంతరం డీఈఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, ఏడీ నాగరాజు, ఏడీ-2 రామకృష్ణ, ఏడీ-3లాజర్, ఎంఈఓ జయచంద్ర, ఏపీఓ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్ష సూచన

బుక్కరాయసముద్రం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో తేలిక పాటి వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి మంగళవారం తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 33- 34.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చున్నారు. గంటకు 2 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన జట్లు

బుక్కపట్నం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): షూటింగ్ బాల్ ఉమ్మడి జిల్లా సబ్‌జూనియర్ బాలబాలికల జట్లను మంగళవారం ఎంపిక చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఇందుకు సంబంధించిన ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. వీరు నవంబరులో అనంతపురం జిల్లా నార్పలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని షూటింగ్ బాల్ సంఘం అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం జగదీష్, పీడీలు ఉషారాణి, నాగరాజు, లక్ష్మీనారాయణ, పీఈటీలు స్వర్ణకుమారి, చెన్నకేశవ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


వెంకటేష్ (ఫైల్)

గుత్తి రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిపల్లిలో మంగళవారం వెంకటేష్ (34) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వెంకటేష్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతి లెక్క తేలాల్సి ఉంది..

రికార్డులు, ఎం. బుక్కులు, ఓచర్లు మాయం
గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి

యాడికి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యాడికి మండల పరిషత్‌లో జరిగిన అవినీతికి సంబంధించి లెక్కలు తేలాల్సి ఉందని డీఎల్‌డీఓ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం యాడికి మండల పరిషత్ నిధుల వినియోగంపై ఆమె రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేకపోవడంతో సంబంధిత అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణకు 2019 నుంచి ఎంపీడీఓగా పనిచేసిన కొండయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేసిన వెంకటేష్, పీఆర్ జేఈ వరకుమార్ హాజరయ్యారు. మరో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ శంకరయ్య హాజరుకాలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు డీఎల్‌డీఓ విజయలక్ష్మి రికార్డులను తనిఖీచేశారు. సంబంధిత అధికారులతో వివరణ తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2019 నుంచి 2023 వరకు చేసిన వర్కులు, వినియోగించిన నిధులు, ఎం. బుక్కులు, ఓచర్లు లేవని తెలిపారు. 2023 నుంచి 2024 వరకు మాత్రమే రికార్డులను చూపించారని ఆమె వివరించారు. 2019 నుంచి రికార్డులు ఏమయ్యాయి అని అధికారులను ప్రశ్నించినట్లు ఆమె తెలిపారు. వాటిపై ఆడిట్ పూర్తయిందని సంబంధిత అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు.

2019 నుంచి రికార్డులు, బిల్లులు, ఓచర్లు అన్ని చూపించాల్సిందేనని ఆదేశించినట్లు చెప్పారు. ఎంత నిధులు దుర్వినియోగమయ్యాయని అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ.. 2019 నుంచి రికార్డులు లేవని, ఎంత దుర్వినియోగమైందో నిగ్గు తేల్చాల్సి ఉందని తెలిపారు. విచారణ సందర్భంగా ప్రస్తుత ఎంపీడీఓ వీరరాజు, ఏఓ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కసాపురం దేవస్థానానికి రూ.28.38 లక్షల ఆదాయం

గుంతకల్లు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి ప్రధాన హుండీల ద్వారా రూ. 28,38,212 ఆదాయం లభించినట్లు ఈఓ కె. వాణి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కసాపురం దేవస్థానంలోని హుండీలను తెరచి భక్తులు వేసిన కానుకలను లెక్కగట్టారు. ప్రధాన హుండీల నుంచి రూ. 28,38,212, అన్నదానం హుండీ ద్వారా రూ. 39,410, అదే విధంగా 620 గ్రాముల వెండి లభ్యమైనట్లు తెలిపారు. ఈ మొత్తాలు సెప్టెంబరు 10 నుంచి అక్టోబరు 28వ తేదీ వరకూ భక్తులు హుండీలలో వేసిన కానుకలు తెలియజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ సుగుణమ్మ, ట్రస్టుబోర్డు సభ్యులు, ఆర్టీసీ హనుమాన్ సేవా సమితి, వీరభద్ర సేవా సమితి వలంటీర్లు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పటేల్ వ్యక్తిత్వాన్ని అలవరచుకోవాలి

డీఆర్ఎం విజయకుమార్

గుంతకల్లు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఉన్న దృఢ సంకల్పాన్ని, గొప్ప వ్యక్తిత్వాన్ని అందరూ అలవరచుకోవాలని డీఆర్ఎం విజయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలలో భాగంగా డీఆర్ఎం కార్యాలయం వద్ద నుంచి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, నైతికతను కలిగి ఉండటమే దేశభక్తి అన్నారు. అనంతరం విద్యార్థులచే రన్ ఫర్ యూనిటీ ర్యాలీని ప్రారంభించారు. రైల్వే అధికారులు, ఉద్యోగుల ఇంటిగ్రిటీ వాకథాన్‌లో డీఆర్ఎం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జేఏ చౌహాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

జీఆర్పీ ఎస్పీ రాహుల్‌మీనా


రక్తదానం చేస్తున్న జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా

గుంతకల్లు టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు మరువలేనివని గుంతకల్లు జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. స్థానిక జీఆర్పీ ఎస్పీ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం అమర వీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం, ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనాతోపాటు పలువురు పోలీస్ సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన జవానులకు ఆత్మశాంతి కలగాలన్నారు. ఓపెన్ హౌస్‌లో పోలీసుల ఆయుధాలను ఎలా వినియోగించాలి అని పలు పాఠశాల విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఆర్పీ ఆర్ఐ రామాంజనేయులు, సీఐ నగేష్‌బాబు, ఎస్‌బీ ఎస్ఐ సురేష్‌బాబు, ఏఆర్ఎస్ఐలు జగన్మోహన్‌రెడ్డి, బి. వెంకటరమణ, బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పండగకొస్తూ.. పరలోకాలకు..

- ఆటోను ఢీకొన్న సీఐ కారు
- ఇద్దరి మృతి
- ఐదుగురికి తీవ్రగాయాలు
- క్షతగాత్రుల్లో సీఐ హరుణ్‌బాషా


విష్ణువర్ధన్ (ఫైల్)


ఆస్పత్రిలో లక్ష్మీబాయి, గాయపడిన రామూ నాయక్

ఊరిలో ఉపాధిలేక.. పొట్టకూటి కోసం.. పొరుగు రాష్ట్రానికెళ్లారు.. దంపతులు.. అక్కడ కూలికెళ్తూ.. నానా పాట్లు పడ్డారు.. పని దొరికితే తిన్నారు.. లేకుంటే పస్తులున్నారు.. దీపావళి పండుగకని.. సొంతూరికి పయనమయ్యారు.. కాసేపట్లో పిల్లలను చూస్తామన్న ఆనందంలో ఉన్నారు.. చదువుకునేందుకు పట్టణానికెళ్లాడు ఓ విద్యార్థి.. పండుగకు ఊరికి బయల్దేరాడు.. కొన్ని నిముషాల్లో ఊరు చేరతాడు.. ఇంతలోనే మృత్యువు కబళించింది.. రోడ్డు ప్రమాదం విద్యార్థిని బలి తీసుకుంది.. వలసెళ్లి వస్తున్న దంపతుల్లో.. భార్యను పొట్టనపెట్టుకుంది.. భర్తను ఆస్పత్రిపాల్జేసింది.. వారి ఇళ్లలో చీకట్లు నింపింది..

ముదిగుబ్బ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు ఆనందంగా ఇంటికి బయల్దేరిన వారిని దారి మధ్యలోనే మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. మండలంలోని నాగారెడ్డిపల్లి క్రాస్ సమీపంలో మంగళవారం ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మరణించగా.. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో ఇంటర్మీడియట్ విద్యార్థి విష్ణువర్ధన్ (18), వలస కూలీ లక్ష్మీబాయి (50) ఉన్నారు. ఆమె భర్త రామూనాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముదిగుబ్బ మండలంలోని పి.కొట్టాల గ్రామానికి చెందిన రామూనాయక్, లక్ష్మీబాయి దంపతులు సొంతూరిలో ఉపాధిలేక కేరళకు వలస వెళ్లారు. దీపావళి పండుగకు సొంతూరికి వస్తున్నారు. కదిరిలో స్వగ్రామం వెళ్లేందుకు ఆటో ఎక్కారు. నల్లమాడ మండల కేంద్రానికి చెందిన వెంకటరమణ, కిష్టమ్మ దంపతుల పెద్ద కుమారుడు విష్ణువర్ధన్ కదిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుండేవాడు. దీపావళి పండుగకు స్వగ్రామానికి బయల్దేరాడు. కదిరిలో రామూనాయక్ దంపతులు ఎక్కిన ఆటోలోనే ఎక్కాడు. కదిరి నుంచి మలకవేముల క్రాస్‌కు ఆటో బయల్దేరింది. మరికొందరు అందులో ఉన్నారు. మండలంలోని నాగారెడ్డిపల్లిక్రాస్ వద్దకు రాగానే అనంతపురం వైపు నుంచి రాయచోటికి వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొంది. విష్ణువర్ధన్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలోని లక్ష్మీబాయి, రామూనాయక్, గంగాధర్, వెంకటరమణ, అనిమీబాయికి తీవ్రగాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న సీఐ హరుణ్‌బాషా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లక్ష్మీబాయి, రామూనాయక్ దంపతుల పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మీబాయి మరణించింది. సీఐ హరుణ్ బాషా ప్రస్తుతం అనంతపురం వీఆర్‌లో ఉన్నారు. ప్రమాద స్థలాన్ని పట్నం పోలీసులు, రూరల్ సీఐ శ్యామరావు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు. దంపతుల మృతితో పి.కొట్టాల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జీడిపల్లి రిజర్వాయర్‌కు 1100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 1100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1100 క్యూసెక్కులు వుండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,094 క్యూసెక్కులు వెళుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.678 టీఎంసీల నీరు నిల్వ వుందన్నారు.

టమోటా కిలో రూ.28

అనంతపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.28తో అమ్ముడు పోయిన ట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 975 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

జిల్లా ఓటర్లు 14,10,082

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

పుట్టపర్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా ఓటర్ల లెక్కతేలింది. 14,10,082 మంది ఓటర్లున్నారు. ఈ మేరకు జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను కలెక్టర్ చేతన్ మంగళవారం విడుదల చేశారు. జిల్లా ఓటర్లలో పురుషులు 7,01,488 మంది, మహిళలు 7,08,531 మంది, ఇతరులు 63 మంది ఉన్నారు. 1313 మంది సర్వీసు ఓటర్లున్నారు. ఈ ఏడాది జనవరిలో 13,91,628 ఓట్లు ఉండగా.. పది నెలల్లో 18,454 మంది పెరిగారు. వచ్చే ఏడాది జనవరి 6న పూర్తిస్థాయి ఓటరు జాబితాను ప్రకటించనున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
మడకశిర	1,05,783	1,05,076	1	2,10,860
హిందూపురం	1,25,140	1,24,977	18	2,50,135
పెనుకొండ	1,18,054	1,88,195	4	2,36,253
పుట్టపర్తి	1,04,368	1,07,073	12	2,11,453
ధర్మవరం	1,21,897	1,24,106	20	2,46,023
కదిరి	1,24,967	1,20,970	8	2,54,045

షర్మిల బాధపడటంలో తప్పులేదు

రాష్ట్రంలోని మహిళలందరితో కంటతడి పెట్టించిన వ్యక్తి జగన్: మంత్రి సవిత


మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అన్న జగన్ మాటలకు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల కంటతడి పెట్టి బాధపడడంలో తప్పులేదని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంత్రి ఆధ్వర్యంలో చేపట్టారు. మంత్రి మాట్లాడుతూ.. మహిళలను గౌరవించలేని వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. తాను జైలులో ఉండగా రాష్ట్రంలో చెల్లి షర్మిలతో పాదయాత్ర చేయించారన్నారు. తల్లి విజయమ్మతో కన్నీళ్లు పెట్టించి 'తన కొడుకు జగన్‌ను కాపాడండి, ఓటేయండ'ని చెప్పించారన్నారు. ఆఖరుకు వారిపైనే జగన్ అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. 'నా అక్క, నా చెల్లి' అంటూనే రాష్ట్ర ప్రజలు, సొంత కుటుంబ సభ్యులను మోసం చేసిన వ్యక్తి జగన్ అంటూ మండిపడ్డారు. దేశంలో ఎక్కడాలేని విధంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో మహిళలపై అత్యాచారాలు, అరాచకాలు, అక్రమ కేసులు ఎక్కువయ్యాయన్నారు. తద్వారా జగన్.. మహిళాద్రోహిగా మిగిలిపోయాడన్నారు.

మూడు మండలాల్లోనే తీవ్ర కరువు

పుట్టపర్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో మూడు మండలాలనే తీవ్ర కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు జాబితాను మంగళవారం విడుదల చేసింది. ఏడు మండలాలను మధ్యస్థ కరువు ప్రాంతాలుగా పేర్కొంటూ రెవెన్యూ (విపత్తు నిర్వహణ) శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపులను తీవ్ర కరువు మండలాల జాబితాలో చేర్చారు. కనగానపల్లి, ధర్మవరం, నంబులపూలకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి మండలాలను మధ్యస్థ కరువు ప్రాంతాలుగా గుర్తించారు. 22 మండలాలకు చోటు దక్కలేదు. పంటలు నష్టపోయినా జాబితాలో చేర్చకపోవడం పట్ల ఆయా మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్తం

అనంత ఐశ్వర్యేశ్వరస్వామికి పూజలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధన త్రయోదశిని పురస్కరించుకుని మంగళవారం హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి ఆలయ ఆవరణలో వెలసిన అనంత ఐశ్వర్యేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మఠం బసవరాజు, భక్తులు పాల్గొన్నారు.

'పునీత్ రియల్ హీరో'



అన్నదానం చేస్తున్న విజయసాయికుమార్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కన్నడ నటుడు పునీత్ రాజ్‌కుమార్ రీల్ హీరో కాదు, రియల్ హీరో అని సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్ పేర్కొన్నారు. పునీత్ రాజ్‌కుమార్ తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి

● తహసీల్దార్ బండారు ఈరమ్మ

గార్లదిన్నె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : టపాసులు విక్రయిదారులు నిబంధనలు తప్పకుండా పాటించాలని తహసీల్దార్ బండారు ఈరమ్మ హెచ్చరించారు. ఆమె మంగళవారం టపాసుల విక్రయదారులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. దీపావళి పండుగను పురష్కరించుకుని గ్రామాల్లో టపాసుల వ్యాపారులు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. గార్లదిన్నె, కల్లూరుల్లో టపాసులు విక్రయించేందుకు ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే కల్లూరులో దుకాణాల ఏర్పాటుకు సరైన స్థలం చూపకపోవడంతో ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, కేవలం గార్లదిన్నెలో ముగ్గురికి అనుమతి ఇచ్చామన్నారు.

రీ సర్వే అర్జీలను పరిష్కరించండి

గార్లదిన్నె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : గ్రామ సభలలో రైతుల నుంచి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ బండారు ఈరమ్మ తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమయ్యారు. మండలంలోని 11 గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయిందన్నారు. ఆయా గ్రామ సభల్లో రైతుల నుంచి 572 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రోత్సాహకాలు

నార్పల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో మంగళవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రతిభావంతులైన ఏడో తరగతి విద్యార్థిని బి సింధు, ఎనిమిదో తరగతి రాజసులోచన, తొమ్మిదో తరగతి పావనికి రూ. 5వేలు చొప్పున అందజేశారు. బ్యాంక్ మేనేజరు బీ నాగరాజు, సిబ్బంది మాథ్యూస్, కేశవకుమార్, పాఠశాల హెచ్‌ఎం మదన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పక్కీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా వీధిలైట్ల ఏర్పాటు

రాప్తాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వీధిలైట్లు అమర్చినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా అన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు బల్బులు ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. దీపావళి పండుగ రోజు అన్ని గ్రామాల్లో వీధిలైట్లు వెలుగుతాయన్నారు. గతంలో గ్రామాల్లో వీధిలైట్లు లేక ఇబ్బంది పడ్డామని గ్రామ సభల్లో ప్రజలు తెలిపారన్నారు. దీంతో ప్రతి గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయించామని ఎంపీడీఓ తెలిపారు.

సాగులో మెలకువలు పాటించాలి

శింగనమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధిచవచ్చని గుత్తి వ్యవసాయ శాఖ ఏడీ వెంకటరాముడు సూచించారు. ఆయన మంగళవారం కల్లుమడిలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌సీ ఏడీఏ శైలజకుమారి ఏఓలు ప్రసాద్, అన్వేష్‌కుమార్, ఏఈఓలు ప్రసాద్, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం ప్రొహిబిషన్ అండ్‌ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు మంగళవారం బెళుగుప్ప మండలం కాలువపల్లి సమీపంలో ఒక వ్యక్తి నుంచి 26 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎక్సైజ్ పరిధిలోని కనగానపల్లి మండలం మద్దెలచెరువు గ్రామంలోఎక్సైజ్ అధికారులు మంగళవారం కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ సీఐ పరుశురాం సిబ్బందితో గ్రామానికి వెళ్లారు. ఓ వ్యక్తి వద్ద నుంచి 45 కర్ణాటక టెట్రాప్యాకెట్లు ఎనిమిది బ్యాటిళ్ల ఆంధ్రా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.ఈ దాడుల్లో సిబ్బంది చంద్ర, శంకరనాయక్, నాగార్జున పాల్గొన్నారు.

టీడీపీ వారంతా నా వారే..!

● వైసీపీ పాలనలో కష్టాలు పడ్డారు
● అందరికీ ఎప్పటికీ అండగా ఉంటా
● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : గత సార్వత్రిక ఎన్నికల్లో నా కోసం పనిచేసినా.. చేయకపోయినా టీడీపీ వారంతా నా వారే అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత వైసీపీ హయాంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. అక్రమ కేసులు పెట్టినా భయపడకుండా పార్టీ కోసం కష్టపడి పనిచేశారన్నారు. గత ఎన్నికల్లో కొన్ని కారణాలతో కొందరు తనకు సహకరించకపోయినా, మనసులో పెట్టుకోలేదన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారందరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. పార్టీ అధిష్టానం మనపై నమ్మకంతో సభ్యత్వ నమోదు కోసం పైలెట్ ప్రాజెక్టుగా అనంత అర్బన్ నియోజకవర్గాన్ని ఎంపిక చేసిందని, నాయకులంతా చురుగ్గా పాల్గొని నిర్దేశించిన సమయం లోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి, సభ్యత్వ నమోదును మరింత వేగవంతంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకుడు లక్ష్మీనారాయణ, మాజీ మేయర్ స్వరూప, నాయకులు గాజుల ఆదెన్న, సరిపూటి రమణ, సుధాకర్ యాదవ్, కృష్ణకుమార్, నారాయణ స్వామి యాదవ్, పీఎం లక్ష్మీప్రసాద్, తమ్మినేని వేణు గోపాల్, సుబాష్ చంద్రబోస్, మణికంఠబాబు, నెట్టెం బాలకృష్ణ, గురు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం చేయించుకోండి

● పరిశీలకుడు లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజలు పెద్ద సంఖ్యలో టీడీపీ సభ్యత్వం చేయించుకోవాలని నియోజకవర్గం పరిశీలకుడు లక్ష్మీనారాయణ కోరారు. స్థానిక 39, 40వ డివిజన్లలో మంగళవారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మాజీ మేయర్ స్వరూప, టీడీపీ రాష్ట్ర నాయకుడు గాజుల ఆదెన్నతో కలిసి ఆయన పరిశీలించారు. 39వ డివిజన్‌లో పలువురితో సభ్యత్వం చేయించారు. ఈ కార్యక్రమంలో ఫిరోజ్ అహ్మద్, టీడీపీ 39వ డివిజన్ ఇన్‌చార్జి చేపల హరి, బోయ శ్రీనివాసులు, సురేష్‌బాబు, కరీం, సోము, జమీర్, మధు, దాదు, రుక్మిణ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈఓ



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మంగళవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవలే బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు వచ్చిన ఆయన బాధ్యతలు తీసుకున్న వెంటనే విజయవాడలో విద్యాశాఖ కమిషనర్ నిర్వహించిన అన్ని జిల్లాల డీఈఓల సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లారు. సమావేశానికి హాజరై తిరిగొచ్చిన ఆయన మంగళవారం కలెక్టర్‌ను కలసి మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన ఫెన్సింగ్ క్రీడాకారులతో డీఎస్‌డీఓ, కోచ్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖేలో ఇండియా జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ బాబా అంబేడ్కర్ యూనివర్సిటీలో స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో ఇండియా ఫెన్సింగ్ పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఇందులో కృష్ణకు బంగారు పతకం, విష్ణుకు రజతం, జ్యోష్ణవి, ప్రభ, ఆదిత్య కాంస్యం పతకాలు సాధించారు. విజేతలను మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో డీఎస్‌డీఓ షఫీ, కోచ్ లక్ష్మి అభినందించారు.

సంప్రదాయాలను పాటించడమే ధర్మ పరిరక్షణ



కలశ పూజ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాలను పాటించడమే ధర్మ పరిరక్షణ అని ఓం సంగీత నృత్య శిక్షణాలయం వ్యవస్థాపకురాలు డాక్టర్ దేవరకొండ కౌసల్య పేర్కొన్నారు. ధన త్రయోదశిని పురస్క రించుకుని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో కలశ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఓం సంగీత నృత్య శిక్షణాలయం ఎపుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సుబ్బలక్ష్మమ్మ, విజయమ్మ, రమ, శిరీష, రాగిణి, అనురాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అనంతపురం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : నగరంలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నవోదయకాలనీకి చెందిన సోమనాథ్, టీవీ టవర్‌కు చెందిన జయపాల్‌రెడ్డి మంగళవారం మున్నానగర్‌లో వాహనంలో తీసుకెళ్తుండగా వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి ఏడు బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఎక్కువ మాత్రలు మింగి యువకుడి మృతి

ఫిట్స్‌తో బాధపడుతున్న ఓ యువకుడు ఎక్కువ మోతా దులో మాత్రలు వేసుకుని మృతి చెందాడు. స్థానిక భాగ్యనగర్ ఏడో క్రాస్‌లో నివాసముంటున్న దుర్గేష్(20కు చిన్నప్పటి నుంచి ఫిట్స్ వచ్చేవి. బెంగుళూరు తదితర ప్రాంతాల్లో చూపించినా నయం కాలేదు. రెండు రోజుల క్రితం ఓ డాక్టర్ తో చూపించుకుని కొన్ని మాత్రలు తీసుకున్నాడు. మంగళవారం దుర్గేష్ ఎక్కువ మాత్రలు వేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలించ గా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ యువకుడు ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడా...? లేక పొరపాటున ఎక్కువ మోతాదులో తీసుకున్నాడా..? అనేది తెలియాల్సి ఉంది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రి అదృశ్యం.. ఉదయం మృతి

ఓ మతిస్థిమితం లేని బాలుడు రాత్రి అదృశ్యమయ్యాడు ఉదయం చూసేసరికి ఇనుపచువ్వ గుచ్చుకుని మృతి చెందాడు. నగరంలోని గుల్జార్‌పేటకు చెందిన మహబూబ్‌బాషా కుమారుడు సాదిక్(17)కు మతిస్థిమి తం సరిగా లేదు. వైద్యులతో చికిత్స పొందుతున్నాడు. సోమవారం రాత్రి 10.30 గంటలకు ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. మంగళవారం ఉదయం పక్క ఇంట్లో మేడపై ఉన్న సిమెంట్ పిల్లర్‌కున్న ఇనుప చువ్వ కడుపులో గుచ్చుకుని ఉన్న సాదిక్ కనిపించాడు. ఆ ఇంట్లో చెప్పుల దుకాణం నిర్వహిస్తున్న వారు షాపు తెరిచి పైకి వెళ్లగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వారు తల్లిదండ్రులకు తెలియజేశారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు నగరంలోని ఓ వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించారు. ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండగా ఓ మహిళతో పాటు మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం రూరల్ మండల పరిధిలోని పూలకుంటకు చెందిన కురుబ భారతి(46)ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భారతిని కొన్నేళ్ల క్రితమే భర్త వదిలేశాడు. ఈ క్రమంలో మంగళవారం తన ఇంట్లోనే పెట్రోల్‌తో నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఇటుకలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి



రక్తదాతలకు పండ్లరసాలు అందజేస్తున్న పరిటాలశ్రీరామ్

రామగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్‌తో పాటు పలువురు అభినందించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన మెగారక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరాన్ని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, పరిటాలశ్రీరామ్ ప్రారంభించారు. మొదటగా సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ పలువురు కానిస్టేబుళ్లతో పాటు దాదాపు 106 మంది రక్తదానం చేశారు. అనంత రం పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మద్యం షాపుల్లో నిబంధనలు పాటించాలి

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

అనంతపురం అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని మద్యం షాపుల్లో నిబంధనల అతిక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ఆదేశించారు. ఆయన మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామ మోహన్‌రెడ్డి, ఏఈఎస్ శ్రీరామ్‌తో కలిసి స్థానిక ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం నుంచి ఉమ్మడి జిల్లాలోని ఎక్సైజ్ సీఐలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా బెల్టు షాపులు ఉండకూడదని సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. అందుకు తగిన పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ఎక్కడైనా నిర్వహిస్తుంటే కేసులు నమోదు చేయాలన్నారు. ఇతర రా ష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమ మద్యం సరఫరా రాకుండా నిఘా పెంచాలన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించండి

● డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని డీపీఓ నాగరాజనాయుడు సిబ్బందిని ఆదేశించారు. ఆయన మంగళవారం సాయంత్రం జిల్లాలోని ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పచ్చదనం పెంపులో భాగంగా ప్రతి పంచాయతీలో కనీసం 200 మొక్కలు నాటించి సంరక్షించాలని ఆదేశించారు. అదే విధంగా పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జనవరి 26 నాటికి వర్మి కంపోస్ట్ విక్రయాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఏఓ నాగరాజు, డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ సౌజన్య, మాధవి, వరలక్ష్మి, డీపీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి

● వెలుగు పీడీ ఈశ్వరయ్య

బుక్కరాయసముద్రం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వెలుగు పీడీ ఈశ్వరయ్య సూచించారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం చైతన్య మండల సమాఖ్య 27వ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీడీ హాజరై మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చైతన్య మండల సమాఖ్య అధ్యక్షురాలిగా బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన బోయ నాగలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా మాహబీ, కార్యదర్శిగా మంగమ్మ, సహాయ కార్యదర్శిగా నారాయణమ్మ, కోశాధికారిగా రేణుకను మహిళా సంఘాల సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీపీ సునీత ఎంపీడీఓ సాల్మన్ రాజు, ఏడీ రత్నకుమార్, ఏపీఎం నారాయణస్వామి, సీసీలు ఈశ్వరయ్య, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కేబుల్ దొంగలను పట్టుకోండి

శింగనమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్ల విద్యుత్ మోటార్ల కేబుల్ చోరీకి పాల్పడుతున్న వారిని పట్టుకోవాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు పేర్కొన్నారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి మండలంలోని తరిమెల, కల్లుమడి, రాచేపల్లి, ఆనందరావుపేట, నిదనవాడ గ్రామాల్లో వ్యవసాయ మోటార్ల కేబుల్, ట్రాన్స్‌ఫార్మర్లలో లో రాగి తీగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నట్లు పదుల సంఖ్యలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేశారన్నారు.

జిల్లాల వారీగా ఎస్సీ వర్గకరణ చేపట్టాలి

శింగనమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాల వారీగా ఎస్సీ వర్గకరణను వెంటనే అమలు చేయాలని జాతీయ మాదిగ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ డిమాండ్ చేశారు. అనంతపురంలో నవంబరు 15న నిర్వహించే మాదిగల ఆత్మీయ సదస్సుపై ఆయన మంగళవారం శింగనమలలో మాదిగలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆత్మీయ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని, పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కదిరప్ప, ఎమ్మార్పీఎస్ నాయకుఉల బండారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భాష్యం విద్యార్థికి రజత పతకం



స్నేహిత్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

అనంతపురం విద్య, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భాష్యం స్కూల్ విద్యార్థి స్నేహిత్ సింహ ఫెన్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించాడు. ఆ విద్యార్థిని స్కూల్ స్టాఫ్ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా అనంతపురం జోన్ జెడ్‌ఈఓ రవివర్మ, ప్రిన్సిపాల్ బాలకృష్ణ మాట్లాడుతూ..... స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో నంద్యాలలో నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థి స్నేహిత్ ప్రతిభ చూపి రజతం సాధించాడ న్నారు. ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలువడం ఆనందంగా ఉందన్నారు. గత ఏడాది కూడా ఆ విద్యార్థి నీటిలో ఎక్కువ సేపు తేలియాడే చిన్న పిల్లాడిగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను కైవసం చేసుకున్నాడని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పీఈటీ, ఇతర సిబ్బంది పాల్గొన్నా రు.

రాష్ట్ర స్థాయి పోటీలకు శింగనమల విద్యార్థులు



ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపిన శింగనమల విద్యార్థులు

శింగనమల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏడుగురు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలో ఈ నెల 28న నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో బాలికల అండర్ - 14 విభాగంలో దాసరి హసిని మొదటి స్థానం, అండర్ - 17లో ముంటిమడుగు లావణ్య రెండో స్థానం, అండర్ - 19 ఇండియన్ రౌండ్‌లో దండువారిపల్లి నిహారిక రెండో స్థానంలో నిలిచారు. అలాగే బాలికల అండర్ - 14 విభాగంలో ఎంపాకుల సుస్మిత మూడో స్థానం, వెన్నపూస శ్రుతి నాలుగో స్థానం, అండర్ -17లో బెస్త దీపిక నాలుగో స్థానం, బాలుర అండర్ - 19 ఇండియన్ రౌండ్‌లో బోడిగానిదొడ్డి కార్తీక్ నాలుగో స్థానంలో నిలిచారు. వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ నందకుమార్ తెలిపారు. వారిని పాఠశాల హెచ్‌ఎం సూజాతమ్మ, విద్యా కమిటీ చైర్మన్ సురేష్‌కుమార్, కమిటీ సభ్యులు, పీడీ, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

ఆస్పత్రి క్యాంటిన్ తనిఖీ

అనంతపురం టౌన్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో రోగులకు భోజనం అందించే క్యాంటిన్‌ను జిల్లా ఆహార భద్రతాధికారి తస్లీమా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మంగళవారం ఆస్పత్రి ఆవరణంలో ఉన్న క్యాంటిన్‌లోకి వెళ్లి అక్కడ ఉన్న వసతులు, నిర్వహణ తీరు, భోజనం, కూరల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● డీఈఓకు సంఘాల నేత వినతి



డీఈఓతో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు డీఈఓను కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, ఇతర రాష్ట్ర, జిల్లా నాయకులు డీఈఓను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లాలో చాలాకాలంగా డీఎస్సీల్లో ఎంపికైన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటితో పాటు మిగిలిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు రామన్న, మున్సిపల్ ఉపాధ్యాయుల రాష్ట్ర కన్వీనర్ పణి భూషణ్, కిశోర్, రాష్ట్ర కౌన్సిలర్లు శివయ్య ఆచారి, కృష్ణ మోహన్, సురేష్ బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు మురళి, నాగభూషణ, శ్రీరాములు, తిమ్మరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన ఆప్టా నాయకులు...

జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబును ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటరత్నం, జిల్లా సహాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి ఇతర నాయకులు డీఈఓను కలిశారు.

టీఎన్‌యూఎస్ నాయకులు... నాయకులు డీఈఓను ఆయన చాంబర్‌లో మంగళవారం టీఎన్‌యూఎస్ కలిశారు. యూ-డైస్ ప్లస్, అపార్ తదితర సమస్యలను డీఈఓను దృష్టికి తీసుకెళ్లారు. టీఎన్‌యూఎస్ నాయకులు రామలింగప్ప, ప్రకాష్, జైపాల్ నాయుడు, గోపాల్, రవీంద్రనాథ్, మృత్యుంజయ, ప్రభాకర్, ఆంజనేయులు, శ్రీనివాసులు, ప్రసాద్ నాగభూషణ తదితరులు ఉన్నారు.

వైఎస్‌ఆర్‌టీఏ నాయకులు... డీఈఓను మంగళవారం వైఎస్‌ఆర్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సైతం కలిశారు. జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి, ఇతర నేతలు డీఈఓను కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, రమణప్ప, గోపాల్, రామకృష్ణ, సిద్ధ ప్రసాద్, సుభాహన్, క్రిష్ణ నాయక్, వెంకటరెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వార్డుల్లో నెలకొన్న సమస్యలపై టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు గళమెత్తారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో సమస్యలను అధికారులు దృష్టికి తీసుకు వస్తున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఛైర్‌పర్సన్ ఎన్. భవాని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్ కృపాకర్ మాట్లాడుతూ వార్డుల్లో పనులపై కౌన్సిలర్లకు తెలపాలన్నారు. పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తమ వార్డులో ఎప్పుడు పనులు చేస్తారని అధికారులను నిలదీశారు. వైస్‌ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి మాట్లాడుతూ వార్డుల్లో సచివాలయ అడ్మిన్లను బెదిరిస్తున్నారని తెలిపారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ తాగునీటి పైపులైన్ మార్చాలని, డ్రైనేజీలు నిర్మించాలని, వీధి దీపాలు వేయించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ నయీమ్ అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఎంఈ లీలాకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ

గుత్తి/రాయదుర్గంరూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గుత్తి తహసీల్దారు కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు లలితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, ధనుంజయ, నాయకులు ఈశ్వరయ్య, మధు, మనోజ్, పవన్, తదితరులు పాల్గొన్నారు. రాయదుర్గంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ మాట్లాడు తూ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వలి, గౌతమ్, అరవింద్, జీవన్, గణేష్ పాల్గొన్నారు.

మూడు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

డి.హీరేహాళ్/బొమ్మనహాళ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. డి.హీరేహాళ్ మండలంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదు అందడంతో విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని సోమలాపురం వంకలో మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. మడేనహళ్లి సమీపంలో అక్రమంగా మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు క్వారీ ల నుంచి అనుమతి లేకుండా కంకర తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేశారు.

నాడు-నేడు పనులను పరిశీలించిన ఆర్డీవో

కూడేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో జరిగిన నాడు-నేడు పనులపై గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. మంగళవారం కూడేరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల, కమ్మూరు పాఠశాలల్లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఛైర్మన్లు బోయరాము, రాము, దేవేంద్ర తదితరులు పాఠశాలల్లో చేసిన పనులు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో ఆర్డీవోకు వివరించారు.

ప్రతి ఒక్కరికీ పరిహారం చెల్లిస్తాం

పుట్లూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణలో నష్టపోయిన ప్రతి ఒక్కరికి పరిహారం చెల్లిస్తామని అనంతపురం ఆర్డీఓ వసంతబాబు పేర్కొన్నారు. మండలంలోని ఎ. కొండాపురంలో 544-డి జాతీయ రహదారి విస్తరణలో నష్టపోయిన రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అరకటవేముల రెవెన్యూ పరిధిలోని ఇళ్లు, పొలాలకు పరిహారం వచ్చిందన్నారు. అనంతరం రహదారిలో పోయిన ఇళ్లు, భూములను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శేషారెడ్డి, మండల సర్వేయర్ శాంతి, హైవే అథారిటీ అధికారులు ఉన్నారు.

జాబ్ మేళాతో ఉద్యోగ అవకాశాలు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జాబ్ మేళాతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో ప్రతిభకు తగిన ఉద్యోగాన్ని ఎంపిక చేసుకుని జీవితంలో స్థిరపడాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపాల్, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజరు పీవీ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE CUM J.M.F.C AT BALLARI.
O.S. No.448/2018

Between:
K.R. Kamanchi ...Plaintiff
AND
A. Sudeer Kumar since deceased by his LRS ...Defendants

NOTICE

Defendant No.5(c)
Madan Mohan S/o Guruswamy
R/o Lakshminagar, Near Coce Cola Godown, Anantapura, Andhra Pradesh - 515001.

WHEREAS, the above named plaintiff has filed above suit against the defendant for the suit for specific performance of contract before this Hon'ble court. JUDG Therefore, your hereby called up on to hereby directed to appear in this court in person or by a pleader duly instructed date at 4-11-24 about 11.00 a.m to show cause against the suit, failing which the suit will be heard and determined absent or ex-parte against yo you No.D-5(c). Given under my hand and seal of the court on this day of 2024Given under my hand and seal of the court on this 27-09-2024 day of

(By Order of the court)

(B.K.Prasanna) Advocate for the plaintiff — Principal Civil Certige PEMFSMF BELLARY

నేడు అత్యవసర సమావేశం

తాడిపత్రి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన అత్యవసర సమావేశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు.